క్లుప్తంగా

అశోక్‌బాబును పరామర్శించిన రాజా



మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబును పరామర్శించిన దాడిశెట్టి రాజా

తుని: ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబును మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పరామర్శించారు. బుధవారం బ్యాంకు కాలనీ నివాసంలో అశోక్‌బాబును కలిశారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని రాజా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కోటనందూరు ఎంపీపీ లగుడు శ్రీనివాస్, అన్నంరెడ్డి వీరరాఘవరావు, ప్రసాద్, పలువురు నాయకులు ఉన్నారు.

కాలువలో దూకి యువతి మృతి

కిర్లంపూడి: ఏలేరు కాలువలోకి దూకి యువతి మృతి చెందిన ఘటనపై బుధవారం కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. భూపాలపట్నానికి చెందిన గుండె సీతయ్య, రమణి దంపతుల కుమార్తె సీత (19) కాకినాడలో నర్సింగ్ చదువుతుంది. ఇంట్లో గొడవ పడి మంగళవారం రాత్రి బయటకు వెళ్లి రాకపోయే సరికి బుధవారం భూపాలపట్నంలోని ఏలేరు కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతురాలి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

రేపు వాహనాల వేలం

ప్రత్తిపాడు: పట్టణ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 5న వేలం నిర్వహించనున్నట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ శివప్రసాద్ తెలిపారు. ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనే పాటదారులు వేలం ప్రారంభానికి ముందు ధరావత్తు సొమ్ము చెల్లించాలన్నారు. ఆధార్ కార్డు నకలు అందజేయాలన్నారు. వేలంలో వాహనం దక్కించుకున్న వ్యక్తి పాడిన సొమ్మును వెంటనే చెల్లించాలన్నారు. వాహనం దక్కించుకున్న వ్యక్తి 18 శాతం, 12 శాతం కానీ జీఎస్టీ సొమ్మును కూడా చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలన్నారు.

కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

ఏలేశ్వరం: మండలంలోని కొత్త యర్రవరంలో ఉన్న ప్రైవేట్ నర్సింగ్ కళాశాల వద్ద బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. కళాశాలలో చదువుతున్న తమ పిల్లలను విజయవాడలోని బ్రాంచ్‌లో కోచింగ్ నిమిత్తం పంపించి వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. తాము విద్యార్థులతో ఎలాంటి పనులు చేయించలేదని, నర్సింగ్‌లో కోచింగ్ నిమిత్తం పంపించామని యాజమాన్యం తెలిపింది. దీంతో కాసేపు గందరగోళం నెలకొంది. యాజమాన్యం నచ్చజెప్పడంతో తల్లిదండ్రులు శాంతించారు.

పీఎమ్‌కేర్ నిధి వడ్డీ అందజేత

గోకవరం: కరోనాలో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు పిల్లలకు రూ.10 లక్షలు పీఎమ్‌కేర్ నిధులను బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా వచ్చిన వడ్డీని సంబంధిత చిన్నారులకు ఇచ్చినట్లు కోరుకొండ సీడీపీవో సంజయ్ రాణి బుధవారం తెలిపారు. గోకవరానికి చెందిన పెరవలి శశి, హెరిన్ తల్లిదండ్రులు 2021లో మృతి చెందగా.. ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున పీఎమ్‌కేర్ నిధులను స్థానిక బ్యాంకులో జమ చేశారు. ఒక్కొక్కరికీ రూ.55 వేలుకి సంబంధించిన చెక్కును బ్యాంక్ మేనేజర్ సూర్య అనుదీప్ కుమార్‌కు అందజేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడితోపాటు కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రత్తిపాడు: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన కారును స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. స్థానిక ఎస్సై లక్ష్మీకాంతం కథనం మేరకు.. ఈనెల 1న ధర్మవరం క్షత్రియ రెస్టారెంట్ వద్ద కారు చోరీకి గురైంది. కోటంశెట్టి శివ తన స్నేహితుడితో కలిసి అనకాపల్లి నుంచి హైదరాబాద్ వెళ్తున్నాడు. తుని సమీపంలో త్రినాధరావు అనే వ్యక్తి లిఫ్ట్ అడిగి వారితో పాటు ప్రయాణిస్తూ.. ధర్మవరంలో వారు వాటర్ బాటిల్ కోసం వెళ్లగా కారుతో పరారయ్యాడు. జీపీఎస్ ఆధారంగా హైవేపై సంతోషమాత ఆలయం సమీపంలో కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని స్థానిక కోర్టులో హాజరుపరచగా.. రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

ఆలయానికి బెంచీల అందజేత

ఏలేశ్వరం: పట్టణంలోని షిర్డినగర్‌లో గాంధీ విగ్రహం సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయానికి బుధవారం దాతలు సిమెంట్ బెంచీలు ఉచితంగా అందించారు. పట్టణానికి చెందిన వాడ్రేవు విశ్వసుందరం, పేరి లక్ష్మి దంపతులు తమ కుమార్తెలు విజయకామేశ్వరీ, దివ్యగాయత్రి జ్ఞాపకార్థం రెండు సిమెంట్ బెంచీలు అందించారు.

కరుణ చూపండి బాబు.!

- రుణాల కోసం ఎదురుచూపులు
- అందని ద్రాక్షలా మారిన పరిస్థితి
- బ్యాంకర్లపై కూటమి నేతల ఒత్తిడి

ప్రత్తిపాడు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అన్నింటా ప్రచార ఆర్భాటం చేస్తుందే తప్ప ఆచరణలో మాత్రం శూన్యం. ఎన్నికల హామీలను అటకెక్కించిన ప్రభుత్వం తాజాగా ప్రకటించిన కార్పొరేషన్‌ల స్వయం ఉపాధి రాయితీ రుణాలను సైతం మరచిపోయింది. ఆశ చూపి.. అటకెక్కిస్తారా అంటూ దరఖాస్తుదారులు లబోదిబోమంటున్నారు. ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి నిమిత్తం రుణాల కోసం దరఖాస్తు చూసుకుంటే ఇంతవరకూ ఒక్కరికీ రుణం ఇవ్వకపోవడంపై మండిపడుతున్నారు. వివిధ వర్గాల్లో వెనుకబడిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన వివిధ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అందని ద్రాక్షలా మారాయి. కేవలం కూటమి ప్రభుత్వం కార్యకర్తలకు వరంగా మార్చుకుంటుందే తప్ప ఎక్కడా పారదర్శకత పాటించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తూతూ మంత్రంగానే..

మండలంలోని కాపు, వైశ్య, క్షత్రియ, బీసీ, ఈ–బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా 97 యూనిట్లకు సబ్సిడీతో కూడిన రూ.5.30 కోట్ల రుణాలు లక్ష్యంగా నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. సబ్సిడీతో కూడిన రుణం కోరుతూ.. ఆయా వర్గాల యువత నుంచి 2,191 దరఖాస్తులు అందాయి. అయితే ఇంటర్వ్యూలు, దరఖాస్తుల ప్రక్రియ అంతా తూతూ మంత్రంగానే ఉందని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంపిణీలోనూ రాజకీయ జోక్యమే..

దరఖాస్తుల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి రుణాల పంపిణీపై రాజకీయ జోక్యం పెరిగిపోవడంతో అర్హతలు ఉన్న సామాన్యులు ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎన్నికలకు ముందు ఇబ్బడిముబ్బడిగా హామీలను గుప్పించి అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం తన ఏడాది పాలనతో పింఛన్ల పెంపు పథకాన్ని తప్ప మరే ఇతర పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసిన దాఖలాలు లేవు. హామీలను నెరవేర్చలేమంటూ కూటమి ప్రభుత్వం చేతులెత్తేస్తున్న తరుణంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఈ క్రమంలో కార్పొరేషన్ కాపు, వైశ్య, క్షత్రియ, బీసీ, ఈ–బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల రుణాల మంజూరుకు కూటమి ప్రభుత్వ పెద్దలు శ్రీకారం చుట్టారు. ఈ రుణాలు కూడా అందరికీ అందుబాటులో లేని పరిస్థితులున్నాయి. యూనిట్లు తక్కువగా ఉండటంతో దరఖాస్తుదారులు ఎక్కువగా ఉన్నారు. దీంతో బ్యాంకు, ఇతర అధికారుల ప్రమేయం లేకుండా నేరుగా కూటమి సిఫార్సు లేఖలే ప్రామాణికంగా ఎంపికలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిరుద్యోగులకు బాసట కరవు

మండలంలో ఎక్కువగా బీసీ సామాజిక వర్గాల వారే ఉన్నారు. బీసీలు మాత్రమే కాకుండా ఇతర సామాజిక వర్గాల్లోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మండలానికి ఎక్కువ యూనిట్లు మంజూరు చేయాల్సి ఉంది. ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. నిరుపేద యువత స్వయం ఉపాధిని పొందేందుకు కార్పొరేషన్ రుణాల కోసం అధిక సంఖ్యలో యువత ముందుకు వస్తున్నా.. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఫలితం లేకుండా పోతుంది.

సమాచారం వచ్చాక రండి

కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులను స్వీకరించి, వాటిని పరిశీలించి, ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. అయితే మీకు తర్వాత సమాచారం పంపుతామని చెప్పి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది వెళ్లమన్నారు. ఎంపిక జాబితాలను మాత్రం వారు వెల్లడించలేదు.



ప్రత్తిపాడులోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం

ప్రత్తిపాడు మండలంలో రుణాల లక్ష్యం, వచ్చిన దరఖాస్తులు

కార్పొరేషన్ రుణాలు రకం	లక్ష్యం	దరఖాస్తులు
కాపు (చంద్రన్న స్వయం ఉపాధి)	35	1,159
వైశ్య	0	32
క్షత్రియ	1	3
బీసీ	59	978
ఈ–బీసీ	1	17
మైనార్టీ	1	2
మొత్తం	97	2,191

దరఖాస్తులు బ్యాంకులకు పంపించాం



కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం వచ్చిన దరఖాస్తులను నిష్పక్షపాతంగా పరిశీలన చేశాం. అర్హత గల దరఖాస్తులను ఎంపిక చేసి, రుణాల మంజూరు కోసం వాటిని బ్యాంకులకు పంపించాం. కార్పొరేషన్ రుణాలకు సంబంధించి ఇంటర్వ్యూల వరకే మా బాధ్యత. రుణాల మంజూరీ కార్పొరేషన్‌తో పాటు బ్యాంకర్ల పరిధిలో ఉంటుంది. బ్యాంకు అధికారులతో సంప్రదించి, రుణాల మంజూరుకు కృషి చేస్తాం.

– కుమార్ బాబు, ఎంపీడీఓ, ప్రత్తిపాడు.

సర్పంచ్ కుటుంబానికి గిరిబాబు పరామర్శ



కొంతంగిలో సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ముద్రగడ గిరిబాబు

శంఖవరం: మండలంలోని కొంతంగిలో ఇటీవల మృతి చెందిన సర్పంచ్ దూడల రామస్వామి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని విచారణ వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన కదారి సోమరాజు తల్లి మరిడమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మండల కన్వీనర్ నరాల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు ఈగల అప్పారావు, సకురు గుర్రాజు, అడపా సోమేష్, పిర్ల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ చేతి వృత్తుల విభాగం అధ్యక్షునిగా యడ్లపల్లి

గోకవరం: వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ చేతి వృత్తుల విభాగ అధ్యక్షుడిగా యడ్లపల్లి అన్నాజీరావుని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కూటమి హయాంలో మోసాలే ఎక్కువ



సమావేశంలో మాట్లాడుతున్న ముద్రగడ గిరిబాబు



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గిరిబాబు

ఏలేశ్వరం: ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. పట్టణంలో బుధవారం పట్టణ పరిధిలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై పోరాడేందుకు తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానన్నారు. కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు వచ్చిన అండగా ఉంటానన్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మోసాలు తప్ప పథకాలు లేవన్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ నాయకులు ఏజెన్సీ రహదారి నిర్మాణం, అప్పన్నపాలెం బ్రిడ్జి నిర్మాణంపై పోరాటం చేయాలని సూచించగా.. అందరి నిర్ణయంతో ముందుకు వెళ్తామన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, వాగు బలరామ్, జువ్విన వీర్రాజు, దిలబర్ హూస్సేన్, అలమండ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణపతిని దర్శించిన గిరిబాబు



కుమ్మరివీధిలో గణపతిని దర్శించుకుంటున్న ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: వినాయక చవితి నవరాత్రుల మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని వినాయక మండపాల వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నసమారాధన ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా కిర్లంపూడిలోని కుమ్మరవీధిలో ఉన్న వరసిద్ధి వినాయకుడిని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు గిరిబాబు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. అనంతరం యూత్ సభ్యులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ తదితరులు ఉన్నారు.

శాకంబరి అవతారంలో గణనాథుడు

కిర్లంపూడి: వినాయక చవితి నవరాత్రులు పురస్కరించుకొని స్థానిక మార్కెట్ యార్డులో ఉన్న లక్ష్మీగణపతి స్వామికి పండితులు బుధవారం ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారు శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు గణపతిని దర్శించుకొని ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా లక్ష్మీగణపతి హోమం



ప్రత్తిపాడు గణేష్‌నగర్‌లో నిర్వహిస్తున్న లక్ష్మీగణపతి హోమం

ప్రత్తిపాడు: గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ప్రత్తిపాడు తోటవీధి గణేష్ నగర్‌లో బుధవారం లక్ష్మీగణపతి హోమం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఐదుగురు రుత్విక్కులు విఘ్నేశ్వర పూజతో విశేష అర్చనలు చేశారు. పుణ్యాహవచనం, పంచగ్రవ్య ప్రాసన, మండపారాధన, స్వామివారికి గరిక పూజ, అష్టద్రవ్య హోమం, పంచామృతాభిషేకం, నిరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ సుబ్రహ్మణ్యం, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



కిర్లంపూడిలోని ఫెర్టిలేజర్ షాపులో స్టాక్ వివరాలు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కిర్లంపూడి: నిబంధనలు అతిక్రమించి ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని కిర్లంపూడి, బూరుగుపూడి, సోమవరం, గెద్దనాపల్లి గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డుల నిర్వాహణ, గోడౌన్‌ల్లోని స్టాక్ వివరాలు పరిశీలించారు. గెద్దనాపల్లిలోని శ్రీసూర్య ఎంటర్ ప్రైజెస్ ఫెర్టిలేజర్ షాపు రికార్డుల్లో ఉన్న స్టాక్ కంటె సుమారు రూ.3 లక్షల విలువ చేసే మూడు రకాల ఎరువులు అనాధికారికంగా ఉన్నట్టు గుర్తించారు. షాపు యాజమానిపై 6ఏ కేసు నమోదు చేయనున్నట్టు తనిఖీ బృందం తెలిపారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ, ఎరువులను ఎంఆర్పీ ధరల కన్నా ఎక్కువకు అమ్మినా, అనాధికారికంగా ఎరువులు ఉంచి బ్లాక్ మార్కెట్‌లో విక్రయించిన డీలర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో తహసీల్దార్ విజయకుమార్, ఏఓ సుధామాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ



రైతులకు సూచనలిస్తున్న విజయ్‌ప్రసాద్

గోకవరం: మండలంలో రంపయర్రంపాలెం, తిరుమలాయపాలెం గ్రామాల్లో ఉద్యాన శాఖ అధికారి రినీ ఆధ్వర్యంలో పామాయిల్, మామిడి, జీడిమామిడి రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సస్యరక్షణ అధికారి విజయ్‌ప్రసాద్ పాల్గొని మామిడి, జీడిమామిడి సాగులో చేపట్టాల్సిన యాజమాన్య ఎరువులపై అవగాహన కల్పించారు. ప్రతి చెట్టుకు 250 గ్రాముల నత్రజని, 60 గ్రాముల పాస్పరం, 60 గ్రాముల పొటాషియం ఇచ్చే ఎరువులతో పాటు 50–100 కిలోల పశువుల ఎరువును వేసుకొని మట్టితో పోల్చాలని సూచించారు. ఇప్పుడున్న తోటలో అధిక సాంద్రత పద్ధతిలో ఎకరానికి 100, 150 చెట్లు తక్కువ దూరంలో వేసుకొని ప్రతి సంవత్సరం కొమ్మలు కత్తిరింపు చేపట్టడంతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. పామాయిల్ పతంజలి కంపెనీ టెక్నికల్ ఆఫీసర్ కార్తీకరెడ్డి మాట్లాడుతూ, డ్రిప్ ద్వారా ఎరువులు అందిస్తే 25 శాతం ఖర్చు తగ్గించుకోవచ్చని, 10 శాతం అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ సహాయకులు నిహారిక, సౌమ్య, సావిత్రి, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ



జగ్గంపేటలో మహిళలకు కుట్టుమెషీన్లు పంపిణీ చేస్తున్న ప్రముఖులు

జగ్గంపేట: పట్టణంలోని గ్రామ పున: నిర్మాణ సంస్థ వివిధ గ్రామాలకు చెందిన 300 మంది మహిళలకు ఉపాధి కోసం వివిధ అంశాలలో శిక్షణ ఇచ్చింది. వీరిలో టైలరింగ్ నేర్చుకున్న 60 మందికి బుధవారం ఓఎన్‌జీసీ సహకారంతో అందజేసిన కుట్టుమెషీన్లు పంపిణీ చేసింది. వీఆర్‌ఓ, ప్రాజెక్టు ఆఫీసర్ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంస్థ అధినేత పాధర్ వెళంగణి రాజు, ఓఎన్‌జీసీ అధికారి జంపాల భాష్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ఆపరేషన్ స్పెషల్ ఆఫీసర్ పాధర్ మరియ నాయక్, పలువురు ఓఎన్‌జీసీ ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ ప్రవచనం



హనుమత్ ప్రవచనం చెబుతున్న చాగంటి కోటేశ్వరరావు

తుని రూరల్: బుద్ధిబలం, మనోబలం కలిగిన వ్యక్తి హనుమ ఒక్కరేనని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. బుధవారం రాత్రి తుని శివారు గెడ్డబీడు సమీప సాయివేదికలో హనుమత్ వైభవం ప్రవచన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న చాగంటి హనుమత్ వైభవాన్ని విశేషంగా చెప్పారు. హనుమ బుద్ధి, గొప్పతనాన్ని మొదట చెప్పింది సుగ్రీవుడు, జాంబవంతుడే అని అన్నారు. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదట రోజు రెండు గంటలపాటు ప్రవచనం నిర్వహించారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది హాజరై ప్రవచనాన్ని విన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

రౌతులపూడి: పొగాకు నియంత్రణపై ఎన్టీసీపీ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జిగిరెడ్డి, నాగదుర్గ, సాయితేజ బృందానికి బుధవారం బహుమతులు ప్రదానం చేశారు. పొగాకు ఉత్పత్తులపై కలిగే అనర్థాలు, పొగాకు వాడకం వల్ల వచ్చే అనారోగ్యాలు, హానికరమైన ప్రభావాలు గురించి విద్యార్థులు చేపట్టిన అవగాహన కార్యక్రమాలకు ఈ బహుమతులు ప్రదానం చేసినట్లు నిర్వాహకులువెతెలిపారు. ప్రతి ఒక్కరూ పొగాకు వాడకానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్టీసీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

అన్నవరం: మద్యం మత్తులో ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడినట్లు ఎస్‌ఐ శ్రీహరిబాబు బుధవారం తెలిపారు. పట్టణంలోని రిజర్వ్ చెరువు వద్ద మద్యం షాపు వద్ద మంగళవారం రాత్రి తమిళనాడుకు చెందిన మణికంఠ స్థానికుడైన రాముఘర్షణ పడ్డారు. బీరుసీసాతో రాముపై దాడి చేయగా గాయపడ్డాడు. రాముని ప్రభుత్వాసుపత్రికి తరలించామని, ప్రాణాపాయం లేదని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నిధులు విడుదల చేయని కూటమి



ఛలో విజయవాడ కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అన్నవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ఇప్పటివరకు గత రెండేళ్లకు సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో కళాశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) నాయకులు బుధవారం విమర్శించారు. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఈనెల 6న విజయవాడలో నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఉదయ్ కుమార్ కోరారు. ఛలో విజయవాడ కరపత్రాలను అన్నవరంలోని జూనియర్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లలిత, పేరూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం తనిఖీ



గండేపల్లిలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న లక్ష్మణరావు

గండేపల్లి: జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డ్స్‌ను పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గండేపల్లిలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి మండలంలోని ప్రతి కేంద్రం నిర్వాహణ ఇదే మాదిరిగా ఉండాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రరావు, ఈసీ రమేష్, పంచాయతీ కార్యదర్శి ఫణీంద్ర కుమార్ తదితరులు ఉన్నారు.

ఎలుకల నిర్మూలన చేపట్టాలి



తొండంగిలో ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పద్మశ్రీ



చిల్లంగిలో ఎలుకల బొరియల వద్ద మందు పెడుతున్న సిబ్బంది

తుని రూరల్: ఖరీఫ్‌లో సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అశోక్ కుమార్ అన్నారు. బుధవారం తుని మండలం ఎస్ఎస్వీ నగరంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకల ఎర ఏ విధంగా తయారు చేయాలి, బొరియల్లో ఏ విధంగా అమర్చాలో క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. ఏఓ మాట్లాడుతూ, రెండు శాతం బ్రోమోడయోలిన్ మందులో 96 శాతం నూకలు, రెండు శాతం నూనె కలిపి ఎర మిశ్రమాన్ని తయారు చేయాలన్నారు. ఎర మిశ్రమాన్ని పేపర్లతో పొట్లాలుగా కట్టి బొరియాల్లో పెట్టాలన్నారు. మండలంలో 9,700 ఎకరాల్లో సామూహిక ఎలుకల నివారణకు ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు ద్వారా 39 కిలోలు బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేశామన్నారు. రైతులు ఎలుకలను నిర్మూలిస్తేనే వరిలో అధిక దిగుబడులు సాధించగలరన్నారు. వ్యవసాయ అధికారి శివకుమారి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల బెడదను అధిగమించండి

కిర్లంపూడి: ఎలుకల బెడద నుంచి వరి పొలాలను కాపాడుకునేందుకు రైతులంతా ఒకేసారి సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారి సుధామాధురి తెలిపారు. చిల్లంగిలోని సుధామాధురి అధ్యక్షతన బుధవారం రైతులకు సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎలుకల మందు తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. ఆమె మాట్లాడుతూ, ఒక కేజీ నూకలలో 20 గ్రాముల బ్రోమడయోలిన్, 20 గ్రాముల నూనె కలిపి, చిన్న చిన్న పొట్లాలు కట్టి ఎలుకల బొరియల దగ్గర పెట్టాలన్నారు. దీని వల్ల ఎలుకల ద్వారా వచ్చే పంట నష్టాన్ని 10–30 శాతం తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు. అనంతరం రైతులతో కలిసి ఎలుకల నివారణ పద్ధతులు కలిగిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఎలుకల నివారణతో పంటకు మేలు

తొండంగి: ఖరీఫ్ సాగులో రైతులంతా ఒకేసారి సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పంటకు కలిగే నష్టం తగ్గి మేలు జరుగుతుందని ఏఓ ఎంఎంపీఎస్ పద్మశ్రీ అన్నారు. బుధవారం తొండంగిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు వరి పంటల్లో వినియోగించేందుకు ఎలుకల మందును పంపిణీ చేశారు. ఎలుకల నివారణ ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నివారణ మందును పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలతో రైతులంతా ఎలుకల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ మాధవ సతీష్ వర్మ, వ్యవసాయ శాఖ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణపై అవగాహన

రౌతులపూడి: మండలంలోని పలు రైతు సేవా కేంద్రాల వద్ద బుధవారం సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సామూహిక ఎలుకల నివారణ ద్వారా ఖరీఫ్ రైతులకు మంచి లాభాలు ఉంటాయన్నారు. వరి పండించే రైతులు ప్రస్తుత తరుణంలో సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.